దిగుబడులకు 'కత్తెర'



మొక్కజొన్న పంట



పంటకు వాటిల్లిన నష్టం

- మొక్కజొన్నలో కత్తెర, లద్దె పురుగుల బెడద
- పంటకు నష్టం
- పురుగు మందుల వినియోగంతో రైతులపై అదనపు భారం

బలిజిపేట: మొక్కజొన్న పంటకు సోకుతున్న కత్తెర, లద్దె పురుగుల బెడదతో రైతులకు కంటిమీద కునుకు లేకుండా పోతోంది. వాటి నివారణకు రైతులు తీవ్రంగా శ్రమించాల్సి వస్తోంది. పంట మొలక దశలోనే లద్దె పురుగు పంటకు తీవ్రనష్టం కలిగిస్తుంటే, కత్తెర పురుగు మొక్కల ఎదుగుదల నుంచి కండె వరకు వివిధ దశల్లో పంటకు హాని కలిగిస్తున్నాయి. పురుగుల నివారణ కోసం రైతులు పురుగు మందులపై ఆధారపడుతున్నప్పటికీ ప్రయోజనం లేకపోతోంది.

రబీలో మొక్కజొన్న సాగుకు మొగ్గు

మొక్కజొన్న సాగుకు రైతులు ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు. రబీలో మొక్కజొన్న సాగు చేపడుతున్నారు. మండలంలో మొక్కజొన్న 1500ఎకరాలకు పైగా సాగుచేస్తున్నారు. నీటి వనరులు అందుబాటులో ఉండడంతో ఆరుతడులకు ఇబ్బందులు ఉండవనే భావనతో రైతులు మొక్కజొన్న వైపు మొగ్గు చూపుతున్నారు. ఖరీఫ్‌లో వరిసాగు అయిన వెంటనే రైతులు రబీలో మొక్కజొన్న పంటవైపు దృష్టిసారిస్తున్నారు. దీంతో పంటసాగు విస్తీర్ణం ప్రతి సంవత్సరం పెరుగుతోంది.

కత్తెర పురుగు ఉధృతి

మొక్కజొన్న రైతులను కత్తెర పురుగు ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. లేత పంటనుంచి ముదురు పంటవరకు ఈ పురుగు ఆశించి తీవ్రంగా నష్టాన్ని చేకూర్చుతోంది. మొదటి దశ గొంగళి పురుగు ఆకులపై పత్రహరితాన్ని గోకి తింటూ ఆకులపై రంధ్రాలను చేస్తోంది. ఈ పురుగు పెరిగే కొద్దీ ఆకుల చివర్లను తింటూ ఆకులను కత్తిరించినట్లుగా కనిపిస్తోంది. ఆకు సుడులను, కాండానికి కూడా రంధ్రాలను చేసి పంటను నష్టపరుస్తోంది. మొక్కజొన్న కంకిలోకి కూడా ఈ పురుగు చేరి లేతకండె భాగాన్ని తింటుంది. చలి వాతావరణం కారణంగా పురుగు ఉధృతి ఎక్కువగా కనిపిస్తోంది. వాటి నివారణకు రైతులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. రసాయన పురుగుమందులు ఎక్కువగా ఉపయోగిస్తుండడంతో అదనపు భారంగా మారింది.

మొలకదశలోనే పంటకు నష్టం

మొలక దశలోనే మొక్కజొన్న పంటకు లద్దె పురుగులు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి. మట్టిలో ఉండే ఈ పురుగు విత్తనాలు విత్తిన పదిరోజుల తరువాత వచ్చే మొలకలకు ఆశించి పంటను నాశనం చేస్తున్నాయి. మొలక భూమి పొరలు దాటిన మరుసటి రోజు నుంచే దాడి చేస్తోంది. పడి మొక్కలు వేసుకున్నా పురుగు తిరిగి ప్రతాపాన్ని చూపిస్తున్నాయి. దీంతో రైతుల్లో ఈ పురుగు పట్ల ఆందోళన నెలకొంది. లద్దె పురుగు ఆశించి పంటనష్టం కలిగిన పలువురు రైతులు పంటను పూర్తిగా దున్ని తిరిగి విత్తనాలు విత్తుతున్నారు.

సకాలంలో పిచికారీ చేయాలి

మొక్కజొన్నకు ఉండే కత్తెర తెగులు నివారణకు మొదటిసారి ఫ్రెఫనోపాస్ ఎకరాకు 300నుంచి 400ఎంఎల్, వేపనూనె 1లీటరు 200లీటర్ల నీటిలో కలిపి స్ప్రే చేయాలి. 2వ సారి అయితే ఇమామెక్టిన్ బెంజిమేట్ ఎకరాకు 80గ్రాములు, వేపనూనె 1లీటరు 200లీటర్ల నీటికి కలిపి స్ప్రే చేయాలి. ఇంకా ఎటువంటి సూచనలు కావాలన్నా వ్యవసాయశాఖ సిబ్బందిని సంప్రదించాలి.

– శ్రావణ్‌కుమార్, ఏఓ, బలిజిపేట మండలం

క్లుప్తంగా

కలాసీ సంఘం సెక్రటరీ మృతికి సంతాపం



సంతాపం తెలుపుతున్న మక్కువ కలాసీలు

మక్కువ: స్థానిక కలాసీసంఘం సెక్రటరీ వడ్డి.సూరిబాబు మృతికి మండలంలోని డబ్బూరవలస గ్రామానికి చెందిన స్థానిక దుర్గా కలాసీసంఘం, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుల అధ్యక్షతన సంతాపం తెలిపారు. మండల కేంద్రం మక్కువలో బుధవారం కలాసీలంతా సంతాపసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఐఎఫ్‌టీయూ నాయుకుడు గోపాలం మాట్లాడుతూ కలాసీసంఘం సెక్రటరీ సూరిబాబు మృతి తీరని లోటన్నారు. కార్యక్రమంలో కలాసీసంఘం నాయుకులు బి.గౌరు, పి.గంగరాజు, ఎ.అప్పారావు, బి.అప్పారావు, బి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నువ్వు చేనులో మిశ్రమ పంటలపై రైతులు దృష్టి సారించాలి



రైతులతో మాట్లాడుతున్న ఏఓ ఎస్.అవినాష్

సీతానగరం: మండలంలో మిశ్రమపంటలపై రైతులు దృష్టి సారించినప్పుడే ఆర్థికంగా లబ్ధి చేకూరుతుందని ఏఓ ఎస్.అవినాష్ అన్నారు. ఈ మేరకు మండలంలోని మరిపివలసలో మండల వ్యవసాయ అధికారి ఎస్.అవినాష్ ఆర్డీఎస్ విధానంలో సాగు చేస్తున్న పంటలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్డీఎస్ విధానంలో రైతులు సాగుచేసిన నువ్వుల పంటలో ఐదు రకాల పంటలు వేసినట్లు చెప్పారు. బెండ, ఆముదం, ముల్లంగి, గోరుచిక్కుడు, గోంగూర పంటలు సాగు చేసినట్లు తెలిపారు. ఆర్డీఎస్ వల్ల నువ్వు పంట వేసేరైతుకు అదనంగా ఆదాయం వస్తుందని, ఇంటికి పోషక విలువలతో కూడిన కూరగాయలు ఆకుకూరలు సమకూర్చుకోవడం ద్వారా సమతుల్యమైన ఆరోగ్యం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వీఏఏ ఆమని రైతులు ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిమితికి మించి ప్రయాణికులతో వాహనాలు నడపరాదు



మాట్లాడుతున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్

సాలూరు: వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని వాహనాలను నడపరాదని మోటార్‌వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు. రహదారిభద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలో ఆటో, మ్యాక్సీ, జీపు తదితర వాహనాల డ్రైవర్లకు అవగాహన పెంపొందించారు. వాహనాల్లో అధిక లోడుతో ప్రయాణం చేయరాదని సూచించారు. వాహన రికార్డులు తప్పక కలిగి ఉండాలన్నారు. రహదారి భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రోడ్‌సేఫ్టీ మెడికల్ ఆఫీసర్ డా.పి.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాతా,శిశు సంరక్షణే ముఖ్యం

- ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ



పౌష్టికాహార ప్రదర్శనను తిలకిస్తున్న పీడీ కనకదుర్గ, సీడీపీఓ శాంతిభవానీ

భామిని: మాతా, శిశు సంరక్షణే ఐసీడీఎస్ లక్ష్యమని ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ అన్నారు. బుధవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీఓ శాంతిభవానీ ఆధ్వర్యంలో నిర్వహించిన పౌష్టికాహార ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. అనంతరం బొడ్డగూడలోని కంటైనర్ సెంటర్‌ను సందర్శించారు. అలాగే సన్నాయికాలనీ, నులకజోడు కేంద్రాలను పరిశీలించి రికార్డులు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈమె వెంట సీడీపీఓ శాంతి భవానీ, ఎస్‌ఓలు సబితా పట్నాయక్, జ్యోతిలక్ష్మి, మహిళా పోలీస్ చందనపట్నాయక్, కార్యకర్తలున్నారు.

నిమ్మగడ్డి సాగుతో లాభాలు



వెంగాపురంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ శ్రావణ్‌కుమార్

బలిజిపేట: గోగుకు ప్రత్యామ్నాయంగా నిమ్మగడ్డి(లెమన్ గ్రాస్) పంటను సాగుచేసుకోవడం వల్ల లాభాలు సంపాదించవచ్చని ఏఓ శ్రావణ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని వెంగాపురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు నిమ్మగడ్డి సాగుపై అవగాహన కల్పించారు. ఇది బహుళవార్షిక జాతికి చెందిన గడ్డిమొక్క అని తెలిపారు. దీనిని అన్ని రకాల నేలల్లో సాగుచేసుకోవచ్చన్నారు. దీనిని వేసవిలో తప్ప మిగిలిన అన్ని కాలాలలో నాటుకోవచ్చని చెప్పారు. మొదటి పంట నాటిన 5-6నెలల తరువాత కోతకు వస్తుందని, తదుపరి కోత 2 నుంచి 3నెలల వ్యవధిలో వస్తుందని తెలిపారు. ఒకసారి నాటిన పైరు నుంచి 4-5సంవత్సరాల వరకు పంట తీసుకోవడం లాభదాయకమన్నారు. దీని తైలాన్ని పరిమళాల పరిశ్రమలలో, విటమిన్-ఎ తయారీకి వినియోగిస్తారని, దీనిలో సిట్రాల్ అనే రసాయన ముంటుందని చెప్పారు. నీటి వసతి ఉంటే రూ.10వేల నుంచి రూ.15వేల వరకు ఆదాయం వస్తుందన్నారు. దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మురళి, రైతులు పాల్గొన్నారు.

స్పీకర్ ప్రకటనను ఖండించండి

పార్వతీపురంటౌన్: 1/70 చట్టాన్ని సవరించాలనే ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడి ప్రకటనను ప్రభుత్వం ఖండించాలని సీపీఐ రాష్ట్ర నాయకుడు కృష్ణమూర్తి అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బీజేపీతో కలిసి నేడు కూటమి పేరుతో పాలన సాగిస్తున్న రాష్ట్రంలోని టీడీపీ-జనసేన ప్రభుత్వం మోడీ అడుగుజాడలలోనే నడవడానికి సిద్ధపడి ఆదివాసీల హక్కులను హరించడానికి పూనుకుందని మండిపడ్డారు. టీడీపీ సీనియర్ నాయకుడు, ప్రస్తుతం రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఇటీవల విశాఖలోని నోవాటెల్ హోటల్లో జరిగిన టూరిజం పారిశ్రామిక వేత్తల సమావేశంలో మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతాలను అభివృద్ధిచేయడానికి 1/70 చట్టం ఆటంకంగా ఉందని, దాన్ని సవరణ చేయాల్సిన అవసరం ఉందని ప్రకటించి స్పీకర్‌గా తన పరిధిని మరిచిపోయి రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా మాట్లాడుతూ ఆదివాసీ వ్యతిరేక, కార్పొరేట్ శక్తుల అనుకూల స్వభావాన్ని వెల్లడించుకున్నారన్నారు. స్పీకర్ అయ్యన్న పాత్రుడు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా 1/70 చట్టంపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 12న జరుగుతున్న ఏపీ రాష్ట్రవ్యాప్త ఏజెన్సీ బంద్‌ను జయప్రదం చేయాలని ఆదివాసీలు, ప్రజలను కోరుతున్నామని పేర్కొన్నారు.

లేబర్ కోడ్ అమలు సరైంది కాదు



నాలుగు రోడ్ల కూడలి వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

- జిల్లాకేంద్రంలో నిరసన

పార్వతీపురంటౌన్: లేబర్ కోడ్‌ల అమల సరైన నిధానం కాదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు అన్నారు. ఈ మేరకు బుధవారం లేబర్ కోడ్‌ల అమలుకు వ్యతిరేకంగా పార్వతీపురం పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, కార్మికుల ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం ముందు నుంచి కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వానికి ప్రస్తుతం ఉన్న కొద్దిపాటి హక్కులను కుదించడమే లేబర్ కోడ్‌ల ముఖ్య ఉద్దేశమన్నారు. సరళీకరణ విధానాల అమలులో భాగంగా ప్రస్తుత కార్మిక చట్టాలు తమకు అడ్డంకిగా ఉన్నాయని వాదిస్తున్నారని, కార్మిక హక్కులు కాలరాసి పెట్టుబడులకు పెద్దపీట వేయడానికి లేబర్ కోడ్‌లు వచ్చాయనన్నారు. లేబర్ కోడ్‌లు అమలులోకి తెచ్చి కార్మిక వర్గాన్ని కట్టుబానిసలుగా పనిచేయించి దోపిడీని మరింత తీవ్రతరం చేయబోతున్నారని ఆరోపించారు. ఏ హక్కులూ లేనప్పుడే కార్మికవర్గం పోరాడి హక్కులు సాధించిందని, పోరాడిన హక్కులు లేకుండా చేస్తామంటే కార్మిక వర్గం చేతులు ముడుచుకుని కూర్చోరాదని పిలుపునిచ్చారు. పోరాడి మన హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కోశాధికారి గొర్లె వెంకటరమణ, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు జి. సర్వేశ్వరరావు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రెడ్డి వేణు, పట్టణ నాయకులు బంకురు సూరిబాబు, మున్సిపల్ కార్మికులు, వర్తక సంఘం కలాసీలు రాగోలు, గేదెల రామారావు, సర్వేశ్వరరావు, చీపురుపల్లి సింహాచలం, నాగవంశం శంకర్రావు, సంతు, పాపులమ్మ, ఇప్పలమ్మ, శివ, ఎం.సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

సీతానగరంలో నిరసన

సీతానగరం: ప్రభుత్వం లేబర్ కోడ్‌అమలుకు జాతీయస్థాయిలో జరుగుతున్న నిరసనకార్యక్రమంలో భాగంగా బుధవారం సీతానగరం మండలంలోని నిడగల్లులో స్కీం వర్కర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. ఈ మేరకు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు వి.ఇందిర మాట్లాడుతూ జాతీయస్థాయిలో 49 కార్మిక చట్టాలను రద్దు చేస్తూ పార్లమెంట్‌లో ఎటువంటి చర్చ లేకుండా సిద్ధం చేయడం తగదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు టి.జ్యోతి, వై.శాంతి కుమారి, టీజే లక్ష్మి రాజమణి, అనసూయమ్మ పుష్ప, మీనా, సావిత్రి పాల్గొన్నారు.

ప్రజ్ఞా వికాస పరీక్షలో పాల్గొనండి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షుడు కె.డేవిడ్

పార్వతీపురంటౌన్: ఫిబ్రవరి 8న జరిగే ప్రజ్ఞా వికాస పరీక్షలో విద్యార్థులు పాల్గొనాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కె. డేవిడ్ అన్నారు. ఈ మేరకు బుధవారం పార్వతీపురంలోని బాలికల పాఠశాలలో ఎస్ఎఫ్ఐ నాయకులు విద్యార్థులతో మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ, ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజ్ఞ వికాస పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పరీక్షలో పాల్గొని అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రైజ్ మనీ ఉంటుందన్నారు. జిల్లా మొదటి స్థానానికి రూ.5000లు రెండవ స్థానానికి రూ.3000లు జిల్లా మూడవ స్థానానికి రూ.2000 బహుమతి ఇవ్వనున్నామన్నారు. మండల స్థాయిలో 200 మంది రాస్తే మొదటి మూడు స్థానాలకు మెమెంటోలు అందజేయ నున్నామన్నారు. పరీక్ష రాసే విద్యార్థులు ఫీజు రూ.30లు చెల్లించి పేర్లను నమోదు చేసుకుని హాల్‌టికెట్ తీసుకోవాలని, విద్యార్థులకు సూచించారు.

గిరిజన గ్రామాల్లో పొలం పిలుస్తోంది

పాచిపెంట: మండలంలోని నీలంవలస, నందేదువలస గిరిజన గ్రామాల్లో సాగవుతున్న పంటలను ఏఓ తిరుపతిరావు పరిశీలించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆ గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ పంటలను మార్పిడి చేయడం, తక్కువ నీటి వనరులతో మంచి దిగుబడి ఏ విధంగా సాధించవచ్చో తదితర అంశాలను వివరించారు. పంటల సాగులో మెలకువలను పాటించాలని తద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు.

రేపటి నుంచి వాలీబాల్ టోర్నమెంట్

భామిని: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న గ్రౌండ్‌లో ఈ నెల 7,8,9 తేదీల్లో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు రెల్లి సంక్షేమ సంఘ అధ్యక్షుడు రాగోలు అశోక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు 63051 22598, 85550 30589 నంబర్లను సంప్రదించాలన్నారు.

రోడ్డు నిర్మాణం వేగవంతం చేయాలి

- కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్



నీల సాగరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్. అధికారులు.

సీతానగరం: మండలంలోని నిడగల్లు-ముత్యాలదొరవలస గ్రామానికి నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. మండలంలోని నిడగల్లులో రూ 2 కోట్లతో నిర్మిస్తున్న బీటీరోడ్డు పనులను, కుచించుకుపోతున్న నీలసాగరాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దీర్ఘకాలంగా ముత్యాలదొరవలస గ్రామస్తుల రాకపోకలకు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా ప్రభుత్వం బీటీరోడ్డు నిర్మాణానికి నిధులు విడుదల చేయడంతో పనులు జరుగుతున్నాయని తెలియజేశారు. ప్రజాసౌలభ్యం కోసం రోడ్డుపనులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే రోడ్డును ఆనుకుని ఉన్న నీలకంఠేశ్వర స్వామి, అమ్మవారి దేవాలయాలకు వెళ్తున్న భక్తులు, ప్రజలకు ఉపయోగ పడుతున్న నీలసాగరం కుచించుకు పోతున్న కారణంగా తక్షణమే అభివృద్ధి చేయడానికి ఉపాధిహామీ పథకం ద్వారా నిధులు మంజూరుచేసి అభివృద్ధి పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసన్నకుమార్, ఎంపీడీఓ త్రివిక్రమరావు, ఆర్‌అండ్‌బీ డీ.ఈ, పీఆర్ డీఈ, రోడ్డు నిర్వాహకులు శ్రీనివాసరాజు, శంకరరావు, ఉపాధిహామీ పథకం ఏపీఓ భాను. ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

గర్భిణులకు సేవలందించడంలో నిర్లక్ష్యం



వినతిపత్రాన్ని చూపిస్తున్న గిరిజన సేవాసంఘం అధ్యక్షుడు ఈశ్వరరావు

పార్వతీపురం: సాలూరు ఏరియా ఆస్పత్రిలో గైనకాలజిస్టుగా పనిచేస్తున్న డాక్టర్ ప్రవంతి గర్భిణులకు సేవలందించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని మన్యం గిరిజన సేవా సంఘం అధ్యక్షుడు ఎం.ఈశ్వరావు ఆరోపించారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ కార్యాలయం ఆవరణలో ఆయన మాట్లాడుతూ ఏరియా ఆస్పత్రిలో గర్భిణులకు చికిత్స అందించాల్సి ఉన్నప్పటికీ డాక్టర్ నిర్లక్ష్యం వహించి సేవలు అందించకపోవడంతో గర్భిణులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారన్నారు. గైనకాలజిస్టుగా పనిచేస్తున్న డాక్టర్ ప్రవంతి పట్టణంలోని ఓ ప్రైవేట్ నర్సింగ్‌హోంలో సేవలు అందిస్తున్నారన్నారు. ఆమెకు అదే ఆస్పత్రిలో పనిచేస్తున్న డాక్టర్ మీనాక్షి సహకరిస్తుందని చెప్పారు. ఈ కారణంగా విధులు నిర్వహించడంలో నిర్లక్ష్యం వహించడంతో గర్భిణులకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. అలాగే గిరిజన రోగులకు పౌష్టికాహారాన్ని అందించాల్సిన డాక్టర్ కాశీవిశ్వనాథ్ కూడా రోగుల సంక్షేమాన్ని విస్మరిస్తున్నారని, డాక్టర్ల పనితీరుపై పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కలెక్టర్‌కు అందజేసిన వినతిపత్రంలో కోరారు.

వెనుకబడిన విద్యార్థులను దత్తత ఇవ్వాలి



మాట్లాడుతున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

సీతంపేట: చదువులో వెనుకబడిన విద్యార్థులను ఆయా సబ్జెక్ట్ టీచర్లకు దత్తత ఇవ్వాలని ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. బుధవారం స్థానిక ఐటీడీఏలో ఆశ్రమ పాఠశాలల హెచ్‌ఎంలు, గురుకులాల ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. డీ, ఈ గ్రేడ్ విద్యార్థులు సీ గ్రేడ్‌కు చేరుకునేలా ప్రత్యేక తర్ఫీదు ఇవ్వాలన్నారు. సులభంగా పాసయ్యేందుకు వీలుగా మెటీరియల్ తయారు చేయాలని సూచించారు. స్టడీ అవర్స్ పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. పాఠశాలల నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీఓ చిన్నబాబు, డీడీ అన్నదొర, డిప్యూటీఈఓ ప్రసన్నకుమార్, ఏటీడబ్ల్యూఓ మంగవేణి, ఏఎంఓ కోటిబాబు, జీసీడీఓ రాములమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సాయం అందిద్దాం.. ప్రాణాలు కాపాడుదాం

- ప్రమాదాల్లో చిక్కుకున్న బాధితులకు అండగా..
- క్షతగాత్రులను సకాలంలో ఆస్పత్రులకు చేర్చాలి



అట్టలి సమీపంలో గాయపడిన వారికి సహకరిస్తున్న స్థానికులు(ఫైల్)



ఏరియా ఆస్పత్రిలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

పాలకొండ రూరల్: ప్రమాదాల బారినపడి సకాలంలో ఆస్పత్రికి చేరుకోలేక ప్రాణాలు కోల్పోయారన్న వార్తలు మనం నిత్యం వింటూ ఉంటాం. ఆ సమయంలో అయ్యో పాపం అంటూ నిట్టూరుస్తాం.. సానుభూతి చూపుతాం.. మరికొంత మంది సంఘటనా స్థలంలో ఉన్నప్పటికీ మనకెందుకులే అనుకుంటారు. మానవతా దృక్పథంతో సాయం చేస్తే కేసులు, పోలీస్‌స్టేషన్ల వెంబడి తిరగాల్సి ఉంటుందని వెనుకడుగు వేస్తారు. సరైన సమయానికి వైద్యం అందక చాలామంది క్షతగాత్రులు మృత్యువాత పడుతున్నారు. దీనిని అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం 'గుడ్ సమరిటన్' చట్టం అందుబాటులోకి తీసుకువచ్చింది. బాధితులకు అండగా నిలిచే వారిని ప్రోత్సహించేందుకు రూపొందిన ఈ చట్టంపై తాజాగా పోలీస్, మోటార్ వెహికల్, వైద్య సిబ్బంది సయుక్తంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. క్షతగాత్రులకు తక్షణ సాయం అందించి ఆస్పత్రికి చేర్చేవారికి రూ.5 వేల నుంచి రూ.25 వేల వరకు ప్రోత్సాహకం అందించేలా చర్యలు చేపట్టారు. నిండు ప్రాణాలు నిలిపే క్రమంలో సహకరించేవారిని ప్రోత్సహించి.. తద్వారా మరింత మందిలో సేవాభావం పెంచేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.

తక్షణ సమాచారం అందిస్తే.....

కళ్ల ముందర సంభవించే రోడ్డు ప్రమాదాలు, ఆ తరహా ఘటనల్లో చిక్కుకుని క్షతగాత్రులుగా మారి ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి సహాయం అందించడంతో పాటు సకాలంలో ఆస్పత్రికి తరలించడం, పోలీసులకు సమాచారం ఇవ్వడం చేస్తే ఇకపై వారికి కేంద్రప్రభుత్వం ఆర్థిక ప్రోత్సాహకం అందించనుంది. సమాచారం పొందిన పోలీసులు అధికారింగా ఈ విషయాన్ని ధ్రువీకరిస్తూ ఓ పత్రాన్ని అందిస్తారు. సహాయం అందించిన వారు సమరిటన్ గుర్తింపు కార్డు, వ్యక్తిగత బ్యాంక్ ఖాతా, పూర్తి చిరునామా, పోలీసులు, ఆస్పత్రి వర్గాలు అందించిన ధ్రువపత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. రవాణా, రెవెన్యూ, పోలీస్, జాతీయ రహదారుల సంస్థ, ఆర్‌అండ్‌బీ, వైద్య, తదితర శాఖల అధికారులతో కూడిన ప్రత్యేక కమిటీ గుడ్ సమరిటన్‌ను గుర్తించి నగదు ప్రోత్సాహకానికి ఎంపిక చేస్తుంది.

ఐదు ధపాలు పొందవచ్చు....

ప్రమాదాల్లో గాయపడిన వారిని గుర్తించిన వెంటనే తొలి గంటలో దగ్గరలోని ఆస్పత్రికి తరలిస్తే ప్రాణాలు కాపాడవచ్చు. ఈ సమయంలో క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి ప్రాణాలు కాపాడేవారికి రూ.5 వేల నుంచి 25 వేల రూపాయల వరకు ప్రోత్సాహకం అందజేస్తారు. ఏడాదిలో ఐదు ధపాలు ఒకే వ్యక్తి ప్రోత్సాహకం అందుకోవచ్చు. ఏడాదిలో అత్యధిక మంది బాధితులను కాపాడిన 10 మందిని గుర్తించి వారికి రూ.లక్ష వంతున నదగు ప్రోత్సాహకం అందిస్తారు.

ఇబ్బందులుండవు



క్షతగాత్రులను రక్షించడం మన బాధ్యత. వారిని సరైన సమయంలో ఆస్పత్రికి తరలించడం ద్వారా బాధితుల ప్రాణాలు కాపాడిన వారమవుతాం. పోలీసులకు సమాచారం అందించడం వల్ల ఎటువంటి ఇబ్బందులుండవు. మా సిబ్బంది కూడా ఈ తరహా కేసుల్లో సహకరించిన వారికి ఎటువంటి అసౌకర్యం లేకుండా చూస్తారు. గుడ్ సమరిటన్‌పై వాహన తనిఖీల్లో భాగంగా అవగాహన కల్పిస్తున్నాం.

– ఎం.చంద్రమౌళి, సీఐ, పాలకొండ

ప్రచారం చేస్తున్నాం..



ప్రమాదాల్లో గాయపడిన వారికి సహకరిస్తే ఇబ్బందులు ఎదురవుతాయోనన్న సందేహం పెట్టుకోవద్దు. ప్రమాదాల్లో క్షతగాత్రులకు సహాయం చేయడం అంటే వారి ప్రాణాలను కాపాడడమే. ప్రస్తుతం అటువంటి సహాయం చేసే వారికి నగదు ప్రోత్సహకం కూడా లభిస్తుంది. ఈ విషయాలపై ప్రజల్లో విస్తృత ప్రచారం చేస్తున్నాం.

– టి.వేణుగోపాలరావు ఎంవీఐ, పాలకొండ